

హోరాహోరీగా ఐఎస్ఎల్

ఉట్నూర్‌లోని కుమురంభీం ప్రాంగణంలో ఇంటర్ సొసైటీ స్పోర్ట్స్ లీగ్ పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. రెండో రోజు హాకీ, ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ పోటీలు నిర్వహించారు. 8లో▸



రైళ్ల హాల్టింగ్‌కు పచ్చజెండా

కరోనా సమయంలో అప్, డౌన్ మార్గాల్లో వన్ సైడ్ హాల్టింగ్ ఎత్తివేసిన రైళ్ల హాల్టింగ్‌ను పునరుద్ధరిస్తూ రైల్వేశాఖ పచ్చజెండా ఊపింది. ఈ మేరకు ఉత్తర్వులు వెలువడ్డాయి. 8లో▸

గరిష్టం/కనిష్టం
31.0 /20.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఈశాన్యం దిశగా చలిగాలులు వీస్తాయి. గరిష్ట కనిష్ట ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలి

- డీసీపీ సుధీర్ రాంనాథ్‌కేకన్



మాట్లాడుతున్న డీసీపీ సుధీర్ రాంనాథ్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): రోడ్డు భద్రతలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం అవుతూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ ప్రమాదాల నివారణకు కృషి చేయాలని డీసీపీ సుధీర్ రాంనాథ్ కేకన్ అన్నారు. గురువారం హాజీపూర్ మండలం వేంపల్లిలోని జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో రోడ్డు భద్రత మాసోత్సవాల ప్రచార కరపత్రాలు, ఫ్లెక్సీలు, స్టిక్కర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ పరిమితికి మించి వేగం, డ్రంక్ అండ్ డ్రైవ్, హెల్మెట్ వినియోగం, సీట్ బెల్ట్ ధరించడం, చిన్నారులకు వాహనాలు ఇవ్వకుండా నియంత్రించడం, ట్రాఫిక్ నియమ, నిబంధనల పాటింపు తదితర కార్యక్రమాలపై ప్రత్యేక కార్యక్రమాలతో మాసోత్సవాలు విజయవంతం చేయాలని అన్నారు. యువత మద్యం తాగి వాహనాలు నడపడం, హెల్మెట్ పెట్టుకోకపోవడం వల్ల రోడ్డు చాలా ప్రమాదాలు జరుగుతున్నట్లు గుర్తించామని, ఈ ప్రమాదాల నివారణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలతోపాటు భారీ జరిమానా, వాహనాలు సీజ్ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీటీఓ కిష్టయ్య, ఏఎంవీఐ శ్రీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

విశ్వనాథ ఆలయ హుండీ లెక్కింపు



హుండీ లెక్కిస్తున్న సభ్యులు, అర్చకులు

మంచిర్యాలఅర్బన్: స్థానిక విశ్వనాథ దేవస్థానంలో గురువారం హుండీ లెక్కించారు. పర్యవేక్షణ అధికారి రమేష్ ఆధ్వర్యంలో ఐదు నెలలకు సంబంధించిన హుండీల లెక్కింపు చేపట్టినట్లు ఆలయ ఈవో రవి తెలిపారు. రూ.4,33,416 ఆదాయం వచ్చిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు గోవర్ధన భట్టాచార్యులు, నరహరిశర్మ, బాలక్రిష్ణ, సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా రఘునాథ్



రఘునాథ్ వెరబెల్లి

మంచిర్యాలటౌన్: మంచిర్యాల జిల్లా బీజేపీ అధ్యక్షుడిగా రఘునాథ్ వెరబెల్లి మరోసారి నియామకం అయ్యారు. రెండోసారి జిల్లా అధ్యక్షుడిగా నియమిస్తూ పార్టీ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు జి.కిషన్‌రెడ్డి, గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. రఘునాథ్ నియామకంపై పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

యూటీఎస్ యాప్‌పై అవగాహన



యాప్‌పై అవగాహన కల్పిస్తున్న రవికుమార్

మంచిర్యాలక్రైం: రైలు ప్రయాణికులు జనరల్ టికెట్ కోసం యూటీఎస్ యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని రైల్వే చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తెలిపారు. గురువారం స్థానిక రైల్వేస్టేషన్‌లో యూటీఎస్ యాప్ వినియోగంపై ప్రయాణికులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైలు ప్రయాణికులు జనరల్ టికెట్ కొనుగోలు చేసేందుకు వరుసలో నిలబడాల్సిన అవసరం లేదని, స్మార్ట్‌ఫోన్ ద్వారా కొనుగోలు చేసే అవకాశం ఉందని అన్నారు. దీనివల్ల సమయం వృథా కాకుండా ప్రయాణికులకు సులభంగా ఉంటుందని తెలిపారు. టీటీలు సిబ్బంది పాల్గొన్నారు.

ఆన్‌లైన్ నమోదుకు గడువు పొడిగింపు

మంచిర్యాలఅర్బన్: 2022–23 సంవత్సరానికి ఇన్‌స్పైర్ అవార్డు మనక్ కాంపిటీషన్ యాప్‌లో ఆన్‌లైన్‌లో నమోదుకు గడువు పొడిగించినట్లు డీఈవో యాదయ్య తెలిపారు. ఇన్‌స్పైర్ అవార్డుకు ఎంపికైన 102 పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, గైడ్ టీచర్లు చొరవ తీసుకుని ఈ నెల 27లోపు నమోదు చేయాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు డీఎస్‌వో మధుబాబును సంప్రదించాలని తెలిపారు.

పులి జాడేది..!



కొత్తూర్‌వాగులో పులి పాదముద్రలు(ఫైల్)



పులి ఆచూకీ కోసం సిబ్బంది అమర్చిన సీసీ కెమెరాలు

- వారం రోజులుగా కనుమరుగు
- ప్రత్యేక బృందాలతో గాలింపు

వేమనపల్లి: ఏడాది కాలంగా మంచిర్యాల జిల్లా అడవులను వీడని ఆ పులి అర్థంతరంగా కనుమరుగైంది. నీల్వాయి, కుశ్నపల్లి, కోటపల్లి, చెన్నూర్ రేంజ్‌లలో ఈ పులి సంచారం ఓ క్రమపద్ధతిలో ఉండేది. మూడు రోజులు చెన్నూర్ రేంజ్‌లో తిరిగితే నాలుగో రోజు పక్కనే ఉన్న కోటపల్లి.. అదే పద్ధతిలో నీల్వాయి, కుశ్నపల్లి అటవీ రేంజ్‌లలో ప్రత్యక్షమయ్యేది. ఆ పులి కదలికలపై జిల్లాలో నిష్ణాతులైన ఓ టైగర్ మానిటరింగ్ అధికారి ఏ రోజు ఎక్కడ ఉందో ఎటువైపు వస్తుందో ఊహాజనితంగా సిబ్బందిని అప్రమత్తం చేసేవారు. ఈ పులి జిల్లా టైగర్ కారిడార్‌లో తనకంటూ ఒక మార్గాన్ని ఏర్పాటు చేసుకుని వస్తూ పోతూ ఉండేది. ఏడాదిగా అడవుల్లో సంచరిస్తున్న పులి జాడ పది రోజులుగా లేదు. దీంతో దారి(ట్రాక్) మరిచిందా..! లేదా మరెక్కడైనా ప్రమాదానికి గురైందా..? అని అధికారులు తల పట్టుకుంటున్నారు. గత ఏడాది పక్కనే ఉన్న కుమురంభీం జిల్లా అడవుల నుంచి వచ్చిన ఫాల్గుణ సంతతికి చెందిన కే–8 పులి పిల్లగా అధికారులు గుర్తించారు. కే–8 రెండు పిల్లలతో తిరిగి కుమురంభీం జిల్లా అడవుల్లోకి వెళ్లిపోగా 18 నెలల వయస్సు ఉన్న ఈ పులి పిల్ల(కబ్) ఇక్కడే తిరుగుతోంది. ఈ పులిని కే–12గా అధికారులు నిర్ధారించారు.

అడవుల జల్లెడ

అదృశ్యమైన ఈ పులి జాడ కోసం నాలుగు అటవీ రేంజ్‌ల్లో ప్రత్యేక బృందాలు అడవులను జల్లెడ పడుతున్నాయి. రేంజ్ పరిధిల్లోని అధికారులతోపాటు జన్నారం, కాగజ్‌నగర్ సిబ్బంది బేస్‌క్యాంపు, స్ట్రైకింగ్‌ఫోర్స్, ఎనిమల్ ట్రాక్స్, హిట్‌కోస్ సంస్థ ప్రతినిధులు 150 మంది సిబ్బందితో అణువణువు గాలిస్తున్నారు. గత పది రోజుల క్రితం కాగజ్‌నగర్ అటవీ డివిజన్ దరిగాం అడవుల్లో రెండు పులులు ఎస్–9, కే–15 విష ప్రయోగంతో మృతిచెందగా తాజాగా ఈ పులి అదృశ్యం అధికారులను కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. ఉన్నతాధికారుల సూచనలతో ఎఫ్‌బీఓ వినయ్‌కుమార్‌సాహు పులి కదలికలపై నిరంతర పర్యవేక్షణ చేస్తున్నారు. ఎన్‌టీసీఏ గైడ్‌లైన్స్ ప్రకారం పులి కదలికలు బయటకు తెలియకూడదనే ఉద్దేశంతో అధికారులు ఏ విషయాన్నీ చెప్పడం లేదు. పులి, పాదముద్రల ఫొటోలు కింది స్థాయి సిబ్బంది ఎవరికీ ఇవ్వకూడదని కఠినమైన ఆంక్షలు విధించారు. కుశ్నపల్లి రేంజ్ రంగపేట, బొప్పారం అటవీ ప్రాంతంలో ఆచూకీ కోసం గత మూడు రోజుల క్రితం ఆయన ఆధ్వర్యంలో సిబ్బంది గాలించారు. పాదముద్రలు లభ్యమైనా గత నెలలో సంచరించిన ఆనవాళ్లుగా గుర్తించారు.

ఉచ్చులతో ప్రమాదం

పులులకు అటవీ సమీప గ్రామాల్లో రైతులు, వేటగాళ్లు అమర్చే ఉచ్చులతో ప్రాణసంకటంగా మారింది. అదృశ్యమైన పులి చివరిసారిగా కొత్తూర్ సమీపంలోని వాగు నుంచి వెళ్లి పోయినట్లు అధికారులు గుర్తించారు. కొత్తూర్, ఆవుడం సమీప గ్రామాల్లోని అనుమానితులైన కొందరు వ్యక్తులను నీల్వాయి, కుశ్నపల్లి అటవీ రేంజ్ పరిధి అధికారులు విచారిస్తున్నట్లు తెలుస్తోంది. మూడు రోజుల క్రితం కుశ్నపల్లి రేంజ్ లింగాల బీట్ మెట్‌పల్లి శివారులో రైతులు అమర్చిన ఉచ్చులో పడి అడవి పంది సైతం మృతిచెందింది. మాంసంతో సహా ఓ వ్యక్తిని పట్టుకున్న అధికారులు మరి కొంత మందికి సంబంధం ఉన్నట్లు దర్యాప్తు చేస్తున్నారు. రెండు నెలల క్రితం కల్మలపేట, కేతన్‌పల్లి శివారులో ఉచ్చులు అమర్చి వన్యప్రాణులు వేటాడిన ముగ్గురిపై నీల్వాయి రేంజ్ అధికారులు కేసులు నమోదు చేశారు. గతంలో కోటపల్లి మండలం చిన్నారం, జైపూ ర్ మండలం శివారాం, బెల్లంపల్లి మండలం గురిజాల గ్రామ అడవుల్లో పులులు మృతి చెందిన ఘటనలు ఉన్నాయి. ఈ పులి సైతం అటవీ సమీప గ్రామాల్లో ఉచ్చులకు బలైందా, లేక దట్టమైన అడవుల్లో ఏదైన వన్యజీవిని వేటాడి మాంసం భుజిస్తూ బయటకు రాకుండా ఉంటుందా అనే విషయంపై స్పష్టత రావడం లేదు.

రైతుబంధుకు నిరీక్షణే..



హాజీపూర్‌లో యాసంగి సాగు చేస్తున్న రైతు

- గత నెల 12 నుంచి నగదు జమ
- నెల గడిచినా ఎకరం దాటలే..
- యాసంగిసాగుకు ఎదురుచూపులు

మంచిర్యాలఅగ్రికల్చర్: రైతుబంధు నగదు జమ ప్రారంభించి నెల రోజులు గడుస్తున్నా ఎకరం భూమి పైబడిన రైతుల ఖాతాల్లో ఇంకా జమ కాలేదు. దీంతో యాసంగి పెట్టుబడి సాయం కోసం నిరీక్షించాల్సి వస్తోంది. గత ప్రభుత్వం మాదిరిగానే కాంగ్రెస్ ప్రభుత్వం గత డిసెంబర్ 12 నుంచి రైతుల ఖాతాల్లో నగదు జమ ప్రారంభించింది. మొదట గుంటలు, అరెకరం, ఎకరం భూమి ఉన్న రైతుల ఖాతాల్లో నగదు జమ అయింది. ఆ తర్వాత రోజువారీగా ఎకరన్నర, రెండు, మూడు ఎకరాల భూమి కలిగిన వారి ఖాతాల్లో విడతల వారీగా జమ చేయాల్సి ఉంది. తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రైతుబంధు స్థానంలో రైతు భరోసా పేరుతో ఏడాదికి ఎకరాకు రూ.15వేల పెట్టుబడి సాయంగా అందజేస్తామని కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. కానీ ప్రస్తుతం గత ప్రభుత్వం మాదిరిగానే యాసంగిలో ఎకరాకు రూ.5వేల చొప్పున జమ చేస్తోంది. జిల్లాలో అర్హులైన రైతులు 1,53,760 మంది ఉండగా.. రూ.170,15,63,671 నగదు ఖాతాల్లో జమ చేయాల్సి ఉంది. ఇప్పటి వరకు ఎకరం లోపు భూమి ఉన్న 55,782 మంది ఖాతాల్లో రూ.16,14,37,457 జమ చేసింది. ఇంకా 97,978 మందికి జమ చేయాల్సి ఉంది. యాసంగి సాగు సీజన్ సగం పూర్తి కాగా సాయం అందక ఆందోళన చెందుతున్నారు.

వానాకాలం నుంచి రైతుభరోసా..

కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చే వానాకాలం నుంచి రైతు భరోసా నగదు అందించేందుకు చర్యలు తీసుకుంటోంది. ప్రస్తుతం వందల ఎకరాల ఉన్న భూస్వాములు, ప్రభుత్వ ఉద్యోగులకు రైతుబంధు అందుతుండగా దీంట్లో మార్పులు చేర్పులు చేయనున్నట్లు తెలుస్తోంది. జూన్‌లో వానాకాలం పంట సాగు సీజన్ ప్రారంభం కానుంది.

ఇంకా రాలేదు..



నెల కిందటే అద్దెకరం రైతులకు రైతుబంధు పైసలు పడ్డయి. ఎకరం పైన భూమి ఉన్నోళ్లకు ఇంకా పైసలు పడలేదు. రోజు సెల్‌మేసేజ్‌లు చూసుడు అయితంది. యాసంగి శనగ పంట వేసుకున్న ఎరువుల కొనుగోలుకు నగదు కోసం ఎదురు చూస్తున్నా. ఆలస్యం చేయకుండా రైతు బంధు పైసలు వేయాలి.

– జాపాతి నారాయణ, నెన్నెల,

సాగు సమయానికి పడత లేవు..



మూడు ఎకరాల్లో యాసంగి సాగు నారు పోసుకున్న.. నాట్లు వేసుకుందామని ఎదురు చూస్తున్న. రైతుబంధు పైసలు పడితే కూలీలకు ఖర్చు ఎల్తదని ఎదురు చూస్తున్న. ఇప్పటికే పడేది ఉండే కాని ఇంకా పడలేదు. రైతుబంధు ఆలస్యం చేయకుండా జమ చేయాలి.

– భూషవేణి అంకగౌడ్, పెద్దంపేట్

అభివృద్ధి పనులు పూర్తి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సంతోష్, పక్కన ఎమ్మెల్యే వినోద్

- అధికారులకు కలెక్టర్ సంతోష్ ఆదేశాలు
- బెల్లంపల్లి నియోజకవర్గ పనులపై ఎమ్మెల్యే వినోద్ సమీక్ష

బెల్లంపల్లి: బెల్లంపల్లి నియోజకవర్గంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్, ఆర్డీవో హరికృష్ణ, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శేషాద్రి, ముఖ్య ప్రణాళిక అధికారి సత్యంతో కలిసి నియోజకవర్గ స్థాయి అధికారులతో అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అభివృద్ధి పనులను పర్యవేక్షించి సమగ్ర నివేదిక తయారు చేయాలని సూచించారు. శాఖల వారీగా అందించే నివేదికల ఆధారంగా పనులు శీఘ్రగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఉప కేంద్రాల నిర్మాణాల కోసం ప్రభుత్వ స్థలాలను గుర్తించాలని, ప్రభుత్వ పాఠశాలల్లో బాలబాలికలకు ప్రత్యేక మూత్రశాలల నిర్మాణానికి స్థలాలు ఎంపిక చేసి ప్రతిపాదనలు పంపించాలని అన్నారు. విద్యుత్, వ్యవసాయ, నీటి పారుదల, మున్సిపల్, ఉద్యానవన ఇతర శాఖల్లో అభివృద్ధి పనులపై పది రోజుల్లోగా మండలాల్లో శాఖల వారీగా సమీక్షిస్తామని తెలిపారు. ఎమ్మెల్యే గడ్డం వినోద్ మాట్లాడుతూ నియోజకవర్గంలో అభివృద్ధి పనులు పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలని, ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకు రావాలని అన్నారు. పట్టణ ప్రజలకు ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి గోదావరి జలాల సరఫరాకు ప్రణాళిక తయారు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో మంద మర్రి, బెల్లంపల్లి ఏరియాల సింగరేణి జనరల్ మేనేజర్లు మనోహర్, రవిప్రసాద్, మున్సిపల్ కమిషనర్ ఆర్.భుజంగరావు, నియోజకవర్గంలోని ప్రభుత్వ శాఖల అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

కలెక్టర్ ఆకస్మిక తనిఖీ



ప్రాణహిత నదిలో కలెక్టర్ సంతోష్

వేమనపల్లి: మండల కేంద్రంలో కలెక్టర్ బదావత్ సంతోష్ గురువారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఎలాంటి సమాచారం లేకుండా రావడంతో అ ధికారులు ఉరుకులు, పరుగులు పెట్టారు. గిరిజన ఆశ్రమ పాఠశాలకు వెళ్లి వసతులపై ఆరా తీశారు. సెలవుపై వెళ్లిన విద్యార్థులు హాస్టల్‌కు రాలేదని హెచ్‌ఎం జ్ఞానేశ్వర్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి గ్రామపాలన దరఖాస్తుల ఆన్‌లైన్, పూర్తయిన వివరాలు తెలు సుకున్నారు. పీహెచ్‌సీకి వెళ్లి రోగుల ఓపీ రిజిష్టర్‌తోపాటు స్టోర్ రూమ్ పరిశీలించారు. పీహెచ్‌సీలో ఖాళీలను భర్తీ చేయాలని కొందరు గ్రామస్తులు, వైద్యాధికారి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన వెంట తహసీల్దార్ సదానందం, ఎంపీఓ బాపురావు, డీటీ గోవింద్, పంచాయతీ కార్యదర్శి సిరాజ్ ఉన్నారు.

ప్రాణహిత నది పరిశీలన

వేమనపల్లిలో ఆకస్మిక తనిఖీ అనంతరం కలెక్టర్ సమీపంలో ఉన్న ప్రాణహిత నది పుష్కర ఘాట్ ప్రాంతాన్ని పరిశీలించారు. నదిలోకి వెళ్లి నీటిమట్టం వివరాలు, ఇసుక నిల్వలపై వివరాలు అడిగారు. అవతలి వైపు ఉన్న మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా సరిహద్దు గ్రామాల వారి రాకపోకలు అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలంలో మహారాష్ట్ర–తెలంగాణకు రాకపోకల కష్టాలపై అధికారులు కలెక్టర్‌కు వివరించారు. నదిలో చేపలు పట్టే జాలర్లు, బోట్ రైడర్ల జీవన పరిస్థితులపై వాకబు చేశారు. చేపల అమ్మకం, మార్కెటింగ్‌పై తెలుసుకున్నారు.

మోడల్ స్కూల్‌లో అక్రమాలపై విచారణ



ప్రిన్సిపాల్‌ను విచారిస్తున్న ఎంఈవో రవీందర్

దండేపల్లి: మండలంలోని లింగాపూర్ మోడల్ స్కూల్‌లో అక్రమాలపై ఎంఈవో రవీందర్, రాపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల పీజీ హెచ్‌ఎం సప్దర్ అలీ గురువారం విచారణ జరిపారు. స్పోర్ట్స్ డ్రెస్‌ల పేరిట ఒక్కో విద్యార్థి నుంచి రూ.1,500, పాఠశాల వార్షికోత్సవం పేరిట ఒక్కో విద్యార్థి నుంచి రూ.200 వసూలు చేసినట్లు కొందరు తల్లిదండ్రులు డీఈవోకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆయన ఎంఈవో రవీందర్, హెచ్‌ఎం సప్దర్‌అలీలను విచారణ అధికారులుగా నియమించారు. డీఈవో ఆదేశాల మేరకు వారు పాఠశాలను సందర్శించి ప్రిన్సిపాల్ అనీలా, సిబ్బంది, ఎస్‌ఎంసీ చైర్మన్, విద్యార్థుల తల్లిదండ్రులతో వేర్వేరుగా మాట్లాడారు. లిఖిత పూర్వకంగా సమాచారం సేకరించారు. డీఈవోకు నివేదిక అందజేయన్నున్నట్లు ఎంఈవో తెలిపారు. పాఠశాలలో అన్యమత ప్రచారం, ఇష్టారీతిన సెలవులపై వచ్చిన అభియోగాలపై కూడా విచారణ జరిపినట్లు పేర్కొన్నారు.

తేలని ఇంకు వివాదం..

ఉపాధ్యాయుల హాజరు పట్టికలో ప్రిన్సిపాల్ తన సెలవులను దిద్దుబాటు చేయడంతో సిబ్బంది, ప్రిన్సిపాల్ మధ్య తలెత్తిన వివాదం, హాజరు పట్టికలో ఇంకు పడిన ఘటనపై సమగ్ర విచారణ చేయకపోవడం అనుమానాలకు తావిస్తోంది. ఇటీవల పాఠశాలను సందర్శించిన మోడల్ స్కూల్ జాయింట్ డైరెక్టర్ సరోజినిదేవి కూడా ఇంకు వివాదంపై విచారణ చేయకుండా.. సమన్వయంతో పని చేసి ఉత్తమ ఫలితాలు సాధించాలని దాటవేయడంపై విమర్శలు వస్తున్నాయి. ఇంకు వివాదంపై ఎంఈవో రవీందర్‌ను సంప్రదించగా, హాజరు పట్టికలో ఇంకు పడడంపై సీసీపుటేజీలను పరిశీలిద్దామంటే అవి పనిచేయడం లేదని అన్నారు. సీసీ కెమెరాల టెక్నీషియన్‌ను పిలిపించి వాటి డాటా ఆధారంగా పరిశీలనకు డీఈవో అనుమతి తీసుకుని, వివరాలు సేకరించి నివేదిక అందిస్తామని చెప్పారు.

హెచ్‌ఐవీపై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న డాక్టర్ సుబ్బరాయుడు

మంచిర్యాలటౌన్: హెచ్‌ఐవీ, ఎయిడ్స్, సుఖవ్యాధుల నియంత్రణపై ప్రతి ఒక్కరికీ అవగాహన కలిగి ఉండాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సుబ్బరాయుడు అన్నారు. జిల్లా కేంద్రంలోని ఓవర్‌బ్రిడ్జి వద్ద జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ విభాగం ఆధ్వర్యంలో ఎయిడ్స్ వ్యాధి అవగాహన, కళాజాత కళాకారుల ప్రదర్శనను డీఎంహెచ్‌వో గురువారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధి ప్రధానంగా నాలుగు కారణాల వల్ల వస్తుందని, సుఖవ్యాధులు ఉన్న వారికి హెచ్‌ఐవీ వ్యాధి సోకే అవకాశం ఎక్కువ ఉందని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఉచితంగా హెచ్‌ఐవీ పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. పరీక్ష వివరాలు రహస్యంగా ఉంచుతారని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. తల్లికి హెచ్‌ఐవీ సోకినా బిడ్డకు సోకకుండా ఉచితంగా సిరప్ ఇస్తారని చెప్పారు. అనంతరం కళాజాత బృందం కళాకారులు ఆటపాటలతో ప్రజలకు హెచ్‌ఐవీ, సుఖవ్యాధులపై జాగ్రత్తలు వివరించారు. ఈ కార్యక్రమంలో మాస్ మీడియా అధికారి వెంకటేశ్వర్లు, జిల్లా సూపర్‌వైజర్ వి.అనిల్ కుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఏరియా ఆస్పత్రిని సందర్శించిన వైద్యబృందం



మందులు పరిశీలిస్తున్న డాక్టర్ అశోక్

బెల్లంపల్లి: బెల్లంపల్లి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిని కాయకల్ప వైద్య బృందం గురువారం ఆకస్మికంగా తనిఖీ చేసింది. డాక్టర్ అశోక్‌తో కూడిన వైద్యుల బృందం ఆస్పత్రిలో కలియదిరిగి నిర్వహణ తీరు, రోగులకు అందిస్తున్న సేవలపై ప్రత్యేకంగా పరిశీలించారు. వైద్య సేవల కోసం ఎంతమంది రోగులు వస్తున్నారు, వీరిలో ఎంతమంది ఆస్పత్రిలో చేరుతున్నారు, అందిస్తున్న వైద్య సేవలపై తెలుసుకున్నారు. ఆస్పత్రి రికార్డులు, ఓటీ, ల్యాబ్, ఓపీ, ఐపీ విభాగాలు సందర్శించి, ఆస్పత్రికి సరఫరా చేసిన మందులు, మాత్రలను నిశితంగా పరిశీలించారు. క్వాలిటీ మేనేజర్ శివసాయి, బృందం వెంట ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రవి, ఆర్ఎంఓ డాక్టర్ వరుణ్, వైద్యులు షబ్బీర్, సకారం, కిరణ్‌కుమారి, ల్యాబ్ టెక్నీషియన్ శ్రీనివాస్ ఉన్నారు.

16న రెడ్‌క్రాస్ సొసైటీ కార్యవర్గం ఎన్నిక

- జిల్లా అదనపు కలెక్టర్ బి.రాహుల్



ఉత్తర్వుల కాపీని జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్‌కు అందజేస్తున్న సభ్యులు

మంచిర్యాలఅగ్రికల్చర్: వచ్చే నెల 16న ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ వార్షిక సర్వసభ్య సమావేశం, నూతన కార్యవర్గ ఎన్నికలు నిర్వహించనున్నట్లు జిల్లా అదనపు కలెక్టర్ బి.రాహుల్ తెలిపారు. గురువార నస్పూర్‌లోని సమీకృత కలెక్టరేట్ అదనపు కలెక్టర్ చాంబర్‌లో సొసైటీ వార్షిక సర్వసభ్య సమావేశం, కార్యవర్గ ఎన్నిక సంబంధిత రాష్ట్ర శాఖ ఉత్తర్వులను జిల్లా చైర్మన్ కంకణాల భాస్కర్‌రెడ్డి, కార్యదర్శి సాగి అనిల్‌కుమార్, వైస్‌చైర్మన్ మహేందర్ జిల్లా అదనపు కలెక్టర్‌కు అందజేశారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ రెడ్‌క్రాస్ సొసైటీలో శాశ్వత సభ్యులు, ఉప పోషకులు, జీవిత సభ్యులు, జీవిత సహచరులతో ఎన్నిక ప్రక్రియ జరుగుతుందని తెలిపారు. మంచిర్యాల జిల్లా శాఖలో ఉమ్మడి ఆది లాబాద్ జిల్లాలో నమోదైన శాశ్వత సభ్యులు ఫొటో గుర్తింపు కార్డులతో హాజరు కావాలని తెలిపారు. తెలంగాణ స్టేట్ మేనేజ్‌మెంటు కమిటీ సభ్యులు, వ్యాసభట్, రాధాక్రిష్ణ, జిల్లా కోశాధికారి పడాల రవీందర్, జిల్లా కమిటీ సభ్యులు మధుసూదన్‌రెడ్డి, కాసర్ల శ్రీనివాస్, సత్యపాల్‌రెడ్డి, ఎడ్ల కిషన్ పాల్గొన్నారు.

ముగిసిన క్రికెట్ టోర్నమెంటు



విజేతకు ట్రోఫీని అందజేస్తున్న నిర్వాహకులు

మంచిర్యాలటౌన్: రోడ్డు భద్రత వారోత్సవాలను పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని శివాజీ మైదానంలో నిర్వహిస్తున్న టీ టెన్ క్రికెట్ టోర్నమెంట్ పోటీలు గురువారం ముగిశాయి. గత మూడేళ్లుగా టీ టెన్ టోర్నమెంట్ పోటీలను వీల్ స్వచ్ఛంద సంస్థ, గురు క్రికెట్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. మొదటి బహుమతి విజేతగా నిలిచిన జట్టుకు రూ.లక్ష నగదు, రెండవ బహుమతి రూ.50 వేలు, మ్యాన్ ఆఫ్ ది సిరీస్‌గా 40 ఇంచుల టీవీని అందజేశారు. మ్యాచ్‌ను తిలకించేందుకు విచ్చేసిన ప్రేక్షకులకు ఉచితంగా హెల్మెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కంకణాల స్వామి, కుమార్, మంద కిరణ్, వైద్య ప్రశాంత్, పూదరి ప్రభాకర్, గురు క్రికెట్ అకాడమీ కోచ్ బింగి గురు ప్రసాద్, కోచ్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రమాదవశాత్తు పత్తి దగ్ధం



దగ్ధమైన పత్తి

చెన్నూర్‌రూరల్: మండలంలోని ఎర్రగుంటపల్లిలో వేములపల్లి శ్రీనివాస్‌రెడ్డికి చెందిన పత్తి ప్రమాదవశాత్తు దగ్ధమైంది. ఇంట్లో సుమారు 50 క్వింటాళ్ల పత్తిని నిల్వ ఉంచగా గురువారం ప్రమాదవశాత్తు విద్యుత్‌షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగి పత్తికి నిప్పంటుకుంది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే మంటలు ఆర్పివేశారు. ఘటనలో సుమారు 15 క్వింటాళ్ల వరకు పత్తి దగ్ధమైందని బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. పత్తి విలువ సుమారు రూ.1.50 లక్షల వరకు ఉంటుందన్నాడు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నాడు.

వృద్ధుడు ఆత్మహత్య



మృతదేహాన్ని పరిశీలిస్తున్న సెకండ్ ఎస్సై

లక్సెట్టిపేట: మండలంలోని దౌడపల్లి గ్రామానికి చెందిన గాగిరెడ్డి లక్ష్మారెడ్డి (64) పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు స్థానిక ఎస్సై లక్ష్మణ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం లక్ష్మారెడ్డికి భార్య నర్సమ్మ, కూతురు, కుమారుడు ఉన్నారు. కూతురు కెనడాలో, కుమారుడు హైదరాబాద్‌లో ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నారు. దంపతులిద్దరూ ఇంటి వద్దే ఉంటున్నారు. కుమారుడు సంక్రాంతికి ఇంటికి వచ్చి మళ్లీ హైదరాబాద్‌కు వెళ్తుండగా ఇద్దరమే ఉంటున్నామని బాధపడుతూ సాగనంపాడు. వృద్ధాప్యంలో ఎవరూ అందుబాటులో ఉండరని మనస్థాపానికి గురై బుధవారం రాత్రి ఇంట్లో పురుగుల మందు తాగాడు. భార్య నర్సమ్మ వచ్చి చూసేసరికి మృతి చెంది ఉన్నాడు. మృతుని కుమారుడు కుమారస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి



దిలీప్(ఫైల్)

కౌటాల: రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై ఎస్.మధుకర్ తెలిపిన వివరాల ప్రకారం కౌటాల మండలంలోని గుండాయిపేట్‌కు చెందిన ఎల్ములే దిలీప్ (32) గురువారం ఉదయం బైక్‌పై పంటచేనుకు వెళ్లి తిరిగి వస్తుండగా గుండాయిపేట గ్రామ సమీపంలో అడవిపంది అడ్డురావడంతో ద్విచక్ర వాహనం అదుపుతప్పి కిందపడిపోయింది. ఘటనలో దిలీప్‌కు తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో కుటుంబ సభ్యులు సిర్పూర్ (టి)లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతునికి భార్య వందన, కుమారుడు కార్తీక్ , కూతురు సాయిశ్రుతి ఉన్నారు. మృతుని సోదరుడు ప్రవీణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

పిచ్చికుక్కల దాడిలో ఒకరికి గాయాలు

కాగజ్‌నగర్‌టౌన్: పిచ్చికుక్కల దాడిలో ఒకరికి గాయాలైన సంఘటన గురువారం కాగజ్‌నగర్ పట్టణంలోని సంజీవయ్య కాలనీలో చోటు చేసుకుంది. కాలనీకి చెందిన ఎం.ప్రభాకర్‌పై పిచ్చి కుక్కలు ఒక్కసారిగా దాడి చేయడంతో గాయాలయ్యాయి. స్థానికులు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. రోజురోజుకూ పిచ్చి కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయని కాలనీవాసులు వాపోతున్నారు. దీంతో ఇండ్ల నుంచి బయటకు రావాలంటేనే జంకుతున్నారు.

హోరాహోరీగా ఐఎస్‌ఎల్

- వివిధ పోటీల్లో క్రీడాకారుల సత్తా
- బహుమతులు ప్రదానం చేసిన అతిథులు



విజేతలకు మెడల్స్ అందజేస్తున్న డీడీ దిలీప్‌కుమార్

ఉట్నూర్‌రూరల్(ఖానాపూర్): మండల కేంద్రంలోని కుమురంభీం ప్రాంగణంలో ఇంటర్ సొసైటీ స్పోర్ట్స్ లీగ్ క్రీడా పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. గురువారం రెండోరోజు హాకీ, ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, హైజంప్, లాంగ్‌జంప్, పరుగు పందెం, డిస్కత్రో పోటీలు నిర్వహించారు. 100 మీటర్ల పరుగుపందెం (అండర్–14) విభాగంలో జాతర్ల ఆశ్రమ క్రీడాకారుడు రాథోడ్ కార్తీక్, ఉట్నూర్‌కు చెందిన రాథోడ్ విక్రం గోల్డ్‌మెడల్ సాధించారు. 600 మీటర్ల విభాగంలో ఉట్నూర్ స్పోర్ట్స్ విద్యార్థి కొడప పరుశురాం గోల్డ్ మెడల్, హుజూర్‌నగర్‌కు చెందిన ప్రవీణ సిల్వర్‌మెడల్, షాట్‌పుట్ విభాగంలో బాయ్స్ వెల్ఫేర్ పాఠశాల విద్యార్థి చరణ గోల్డ్ మెడల్, ఉట్నూర్ స్పోర్ట్స్ స్కూల్ విద్యార్థి మర్సుకోల ఇందూర్ షావ్ సిల్వర్ మెడల్ సాధించారు. 100 మీటర్ల పరుగుపందెం (అండర్–17) విభాగంలో కొలికొండ పాఠశాలకు చెందిన శివప్రసాద్ గోల్డ్ మెడల్, చిలుకూర్ పాఠశాలకు చెందిన రాజేశ్ సిల్వర్ మెడల్, 800 మీటర్ల విభాగంలో ముత్కల్ విద్యార్థి బసంత్ గోల్డ్ మెడల్, జేపీనగర్ విద్యార్థి సంతోష్ సిల్వర్ మెడల్ సాధించారు. హైజంప్ అండర్–14 విభాగంలో జాతర్ల పాఠశాలకు చెందిన మడావి సోము గోల్డ్ మెడల్, చిట్యాల్‌కు చెందిన మురళీ కృష్ణ సిల్వర్ మెడల్, డిస్కత్రోలో నల్గొండకు చెందిన పవన్‌కుమార్ గోల్డ్ మెడల్, ఉప్పల్‌వాయికి చెందిన గౌతమ్ సిల్వర్‌మెడల్, హైజంప్ అండర్–17 విభాగంలో ఉట్నూర్ స్పోర్ట్ స్కూల్ విద్యార్థి జాదవ్ శ్రీకాంత్ గోల్డ్ మెడల్, హరిప్రసాద్ సిల్వర్ మెడల్, లాంగ్‌జంప్ విభాగంలో భద్రాచలంకు చెందిన వెంకటేశ్వర్‌రావు గోల్డ్ మెడల్, ఎన్కూర్ పాఠశాల విద్యార్థి చరణ్‌కుమార్ సిల్వర్ మెడల్ సాధించారు. విజేతలకు డీడీ దిలీప్‌కుమార్ మెడల్స్, సర్టిఫికెట్లు అందజేశారు. జిల్లా క్రీడల అధికారి పార్థసారథి పోటీలను పర్యవేక్షిస్తున్నారు.



హాకీ ఆడుతున్న క్రీడాకారులు



వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు



కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

ఎక్కడి చెత్త అక్కడే..



ఆర్‌కేపీలోని కార్మికవాడల్లో పేరుకుపోయిన చెత్త

- కంపు కొడుతున్న కార్మిక కాలనీలు
- కరువైన చెత్తకుండీలు
- వాహనాలతో ఇబ్బందులు
- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న సింగరేణి యాజమాన్యం

రామకృష్ణాపూర్: బొగ్గు ఉత్పత్తిలో కీలకమైన కార్మికుల సంక్షేమం విషయంలో సింగరేణి యాజమాన్యం చేతులెత్తేస్తోంది. ఏళ్లుగా కాలనీల్లో పారిశుధ్య సమస్యలు తలెత్తుతున్నా సంబంధిత అధికారులు నిర్లిప్తత ప్రదర్శిస్తుండడం విమర్శలకు తావిస్తోంది. మందమర్రి ఏరియా పరిధిలోని రామకృష్ణాపూర్ పట్టణంలో పారిశుధ్య సమస్య పట్టిపీడిస్తోంది. సింగరేణి యాజమాన్యం ఈ బాధ్యతలు చూస్తున్నప్పటికీ సమస్య కొలిక్కి రావడంలేదు. ఫలితంగా ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోతోంది. దీంతో పాటు డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 22 వార్డుల్లో మెజారిటీ వార్డులు రామకృష్ణాపూర్ పరిధిలోకే వస్తాయి. ఆర్‌కేపీలో ఎక్కువ శాతం వార్డులు సింగరేణి పరిధిలో ఉండడంతో పారిశుధ్య పనులు సింగరేణి చూస్తూవస్తోంది. పట్టణంలోని ఏ జోన్, బీ జోన్ ఏరియాల్లో 20 కి పైగా కాలనీలు ఉండగా సిబ్బంది మాత్రం అరకొరగానే ఉండడం ఈ సమస్యకి కారణంగా చెప్పవచ్చు.

మున్సిపాలిటీకి బాధ్యతలు..

పారిశుధ్యం విషయంలో చేతులెత్తేసిన సింగరేణి యాజమాన్యం ఆ బాధ్యతలను క్యాతనపల్లి మున్సిపాలిటీకి అప్పగించడంలో ఎదురవుతున్న ఇబ్బందులు ఏమిటని పట్టణ ప్రజలు మండిపడుతున్నారు. సరిపడా చెత్త వాహనాలు, కుండీలు సమకూర్చడంలో విఫలమవుతున్నా అధికారులు ఆ బాధ్యతలను మున్సిపాలిటీకి అప్పగిస్తే తప్పేమిటని ప్రశ్నిస్తున్నారు. చెత్త తొలగించడానికి ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించకపోవడం , పట్టణ సుందరీకరణ అంశాన్ని గాలికొదిలేయడం విమర్శలకు దారితీస్తోంది. ఇప్పటికైనా ఏరియా ఉన్నతాధికారులు స్పందించి పట్టణంలోని చెత్తా చెదారం తొలగించేలా చర్యలు తీసుకోవాలని, సిబ్బందికి సరిపడా వాహనాలు సమకూర్చాలని కార్మికులు కోరుతున్నారు.

రెండు ట్రాక్టర్లు...4 ట్రై సైకిళ్లు...

రామకృష్ణాపూర్ పట్టణంలో పారిశుధ్య నిర్వహణ పనులు చూస్తున్న సింగరేణి యాజమాన్యం సదరు కాంట్రాక్ట్ కార్మికులకు సరిపడా వాహనాలు సమకూర్చడంలేదు. ఏ జోన్, బీ జోన్ ఏరియాల్లో 3 వేలకు పైగా కంపెనీ క్వార్టర్లు ఉండగా ఇందుకు తగ్గట్టుగా చెత్త తీసేందుకు సరిపడా వాహనాలు మాత్రం ఏర్పాటు చేయలేదు. ఏజోన్, బీజోన్ ఏరియాల కు రెండింటికీ కలిపి రెండే ట్రాక్టర్లు, ఇంటింటా చెత్త ను సేకరించేందుకు కేవలం నాలుగు ట్రై సైకిళ్లు ఉన్నాయి. దీంతో ఇన్ని కాలనీల్లో చెత్తను తొలగించేందుకు సిబ్బందికి ఇబ్బందులు తప్పడం లేదు. ఫలితంగా ఆయా ప్రధాన కూడళ్లల్లో ఎక్కడి చెత్త అక్కడే ఉంటోంది. ఇక పట్టణం మొత్తానికి కలిపి సిబ్బంది కూడా కేవలం 60 మంది మాత్రమే ఉన్నారు.

‘అద్దంకి దయాకర్‌కు ఎమ్మెల్సీ ఇవ్వాలి’

పాతమంచిర్యాల: మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు అద్దంకి దయాకర్‌కు ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలని తెలంగాణ మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు గజెల్లి లక్ష్మణ్, రాష్ట్ర అధికార ప్రతినిధి పైడిమల్ల నర్సింగ్, జై భీం సైనిక్‌దళ్ రాష్ట్ర కో ఆర్డినేటర్ ఆసాది పురుషోత్తం డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. దయాకర్‌కు ఎమ్మెల్సీ ఇచ్చినట్లే ఇచ్చి గంటల వ్యవధిలోనే రద్దు చేస్తున్నట్లు ప్రకటించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పునరాలోచన చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మాల మహనాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు పొలిటెక్ శంకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎర్రోళ్ల నరేష్, జిల్లా ఉపాధ్యక్షుడు మార్త కుమారస్వామి, జిల్లా కార్యదర్శి గోక శ్రీనివాస్, ప్రచార కార్యదర్శి నక్క శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న నాయకులు

‘ఈపీఎఫ్ డబ్బులు ఖాతాలో జమ చేయాలి’

నస్పూర్: మున్సిపాలిటీలో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ సిబ్బంది ఈపీఎఫ్ డబ్బులు తమ పీఎఫ్ ఖాతాలలో జమ చేయాలని నస్పూర్ మున్సిపల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు కొయ్యల వెంకటి డిమాండ్ చేశారు. తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ గురువారం విలేజ్ నస్పూర్ టర్నింగ్ వద్ద రిలే దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ సిబ్బంది జీతాల నుండి మూడేళ్లుగా నెలకు రూ.1,900 చొప్పున ఈపీఎఫ్ డబ్బులు కట్ చేస్తున్నారని, వాటిని కార్మికుల పీఎఫ్ ఖాతాలలో జమ చేయడం లేదన్నారు. దీక్షలను యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు సుదమల్ల హరికృష్ణ సందర్శించి వారికి సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి దాసరి రాజేశ్వర్, ఉపాధ్యక్షుడు మద్దెర్ల సతీష్, కోశాధికారి మాడ్గుల రాజం, నాయకులు గేరె లింగయ్య, అడ్లకొండ ప్రభాకర్, గారె కిష్టయ్య, దాసరి రమ, రాజం, తదితరులు పాల్గొన్నారు.



రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న సిబ్బంది

ఐటీఐ విద్యార్థులకు బ్రిడ్జి కోర్సు



మంచిర్యాల ఐటీఐ భవనం

- పాలిటెక్నిక్‌లో చేరేందుకు అవకాశం
- దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం
- ఈ నెల 31 తుది గడువు

మంచిర్యాలఅర్బన్: ఉజ్వల భవితకు పాలిటెక్నిక్ వారధిగా నిలుస్తోంది. కోర్సు పూర్తయిన వెంటనే ఉద్యోగ అవకాశం లభిస్తోంది. ఇంత ప్రాధాన్యం ఉన్న పాలిటెక్నిక్ కోర్సులో నేరుగా చేరేందుకు ఐటీఐ పూర్తి చేసిన వారికి ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఈ కోర్సులో చేరేందుకు బ్రిడ్జి కోర్సులను అమల్లోకి తెచ్చింది. ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులు పాలిటెక్నిక్ రెండో సంవత్సరంలో ప్రవేశాలు పొందవచ్చు. ఈ నెల 31వరకు దరఖాస్తుల స్వీకరణ గడువు ముగియనుంది.

దరఖాస్తుల పక్రియ ప్రారంభం

పాలిటెక్నిక్‌లో చేరేందుకు ఐటీఐ విద్యార్థులకు బ్రిడ్జి కోర్సు ప్రవేశపెట్టారు. జిల్లాలో 12 ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐ కళాశాలలున్నాయి. మంచిర్యాల, మందమర్రి, శ్రీరాంపూర్, జన్నారంలో ప్రభుత్వ ఐటీఐలు ఉండగా ఎనిమిది ప్రైవేట్ కళాశాలలున్నాయి. మంచిర్యాల ఐటీఐలో బ్రిడ్జి కోర్సు ప్రవేశానికి దరఖాస్తులు అందజేయాల్సి ఉంటుంది. పదో తరగతి మెమో, ఐటీఐ ఉత్తీర్ణత సర్టిఫికెట్, రెండు పాస్ పోర్టు సైజ్ ఫొటోలతో ఈ నెల 31లోపు దరఖాస్తులు సమర్పించవచ్చు. థియరీ, ప్రాక్టికల్స్ పరీక్షలు నిర్వహించి అర్హులను ఎంపిక చేయనున్నారు. తర్వాత ఎల్పీ సెట్‌లో సాధించిన ర్యాంకు ఆధారంగా 2024–25 విద్యా సంవత్సరానికి గాను పాలిటెక్నిక్ ద్వితీయ సంవత్సరం ప్రవేశాలు కల్పించనున్నారు.

31 తుది గడువు

ఐటీఐ రెండేళ్ల కోర్సు పూర్తి చేసుకున్న వారంతా పాలిటెక్నిక్ కోర్సు ప్రవేశాలకు నిర్వహిస్తున్న బ్రిడ్జి కోర్సు సద్వినియోగం చేసుకోవాలి. బ్రిడ్జి కోర్సులో ప్రవేశాలకు జిల్లాలో 40 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఈ నెల 31 వరకు తుది గడువు ఉందని, ఆసక్తి కలిగిన అభ్యర్థులు 31లోపు దరఖాస్తులు చేసుకోవాలి.

– చందర్, ఐటీఐ ప్రిన్సిపాల్, మంచిర్యాల

పీఆర్టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ

మంచిర్యాలఅగ్రికల్చర్: పీఆర్టీయూ నూతన సంవత్సర క్యాలెండర్‌ను డీఈవో ఎస్.యాదయ్య గురువారం సమీకృత కలెక్టరేట్‌లోని విద్యాశాఖ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి ఎంతో గౌరవప్రదమైనదని, ఉపాధ్యాయులు నిబద్ధతతో పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ధరణికోట వేణుగోపాల్, సూరినేని గంగాధర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామకృష్ణ, సుధీర్‌రావు, కొత్తవడ్ల లక్ష్మీనారాయణ, రామ్మోహన్‌రావు, సత్యనారాయణరావు, శ్రీనివాస్, సత్యేంద్రకుమార్, జిల్లా ఉపాధ్యక్షులు కావిరి సాంబయ్య, అడిచర్ల సాగర్, పర్వతి శ్రీనివాస్, తిరుమలేశ్, రవి, అఖిల్, వెంకటేష్ పాల్గొన్నారు.



ఆవిష్కరిస్తున్న డీఈవో యాదయ్య

రైళ్ల హాల్టింగ్‌కు పచ్చజెండా

- ఉత్తర్వులు జారీ చేసిన రైల్వే అధికారులు



బెల్లంపల్లి రైల్వేస్టేషన్‌లో ఆగిన రైలు

బెల్లంపల్లి: కరోనా వైరస్ ప్రబలిన నేపథ్యంలో అర్ధంతరంగా అప్ డౌన్ మార్గాల్లో వన్‌సైడ్ హాల్టింగ్ ఎత్తివేసిన పలు సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్‌ను పున:రుద్ధరిస్తూ రైల్వేశాఖ పచ్చజెండా ఊపింది. ఈమేరకు దక్షిణ మధ్య రైల్వే ఏటీఎం/సీహెచ్‌జీ సురేష్‌రెడ్డి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 20 నుంచి నిర్దేశించిన రైల్వేస్టేషన్లలో పునరుద్ధరణకు నోచుకున్న సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ సౌకర్యం వర్తింప జేయనున్నట్లు ప్రకటించారు. మంచిర్యాల, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాల పరిధిలోని బెల్లంపల్లి, మంచిర్యాల, కాగజ్‌నగర్, ఆసిఫాబాద్‌రోడ్ రైల్వేస్టేషన్‌లలో రైళ్ల హాల్టింగ్‌కు ఆదేశాలు వెలువడ్డాయి. దాదాపు నాలుగేళ్ల విరామం తర్వాత మోక్షం లభించడంతో రైలు ప్రయాణికుల్లో హర్షం వ్యక్తమవుతోంది.

ప్రయోగాత్మకంగా హాల్టింగ్

సూపర్‌ఫాస్ట్ రైళ్లకు నిరంతరాయంగా కాకుండా ఆరు నెలల పాటు ప్రయోగాత్మకంగా హాల్టింగ్ సదుపాయం కల్పించారు. నిర్దేశించిన కాలపరిమితి గడువులో ఏఏ రైల్వేస్టేషన్‌లో రోజువారీగా ఎన్ని టికెట్లు జారీ అవుతున్నాయి.. అప్, డౌన్ మార్గాల్లో ఎన్నెన్ని టికెట్లు విక్రయించారో లెక్క కడతారు. ఆతీరుగా ఐదో నెలలో సమీక్ష చేసి ఆ తర్వాత ఆయా రైల్వేస్టేషన్‌లలో రైళ్ల హాల్టింగ్ కొనసాగించాలా? వద్దా? అనేది రైల్వే అధికారులు నిర్ణయం తీసుకుంటారు.

హాల్టింగ్ కల్పించిన రైళ్లు ఇవే

- బెల్లంపల్లి రైల్వేస్టేషన్‌లో ప్రస్తుతం తిరుపతి నుంచి హజ్రత్ నిజాముద్దీన్ వెళ్లే ఏపీ సంపర్క్ క్రాంతి సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (నం.12708) రైలుకు అప్ మార్గంలో హాల్టింగ్ ఉండగా ఇప్పుడు డౌన్ మార్గంలో హాల్టింగ్ పునరుద్ధరించారు.
- హైదరాబాద్ నుంచి హజ్రత్ నిజాముద్దీన్‌కు వెళ్లే దక్షిణ్ ఎక్స్‌ప్రెస్ (నం.12721) రైలుకు బెల్లంపల్లి రైల్వేస్టేషన్‌లో డౌన్ మార్గంలో హాల్టింగ్ ఉండగా ప్రస్తుతం అప్ మార్గంలో నిలుపుదలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు.
- సికింద్రాబాద్ నుంచి రాయ్‌పూర్ వెళ్లే రాయ్‌పూర్ ఎక్స్‌ప్రెస్ (నం.12771) రైలుకు బెల్లంపల్లి రైల్వేస్టేషన్‌లో అప్‌సైడ్‌లో హాల్టింగ్ కల్పించారు. ప్రస్తుతం డౌన్‌లో హాల్టింగ్ కొనసాగుతోంది.
- సికింద్రాబాద్ నుంచి గోరఖ్‌పూర్ వెళ్లే సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (నం.12590) రైలుకు బెల్లంపల్లి రైల్వేస్టేషన్‌లో అప్ మార్గంలో నిలుపుదల సౌకర్యం వర్తింపజేశారు. ఇదివరకే డౌన్ మార్గంలో సదరు రైలును ఆపుతున్నారు.
- ఎర్నాకులం నుంచి పాట్నా వెళ్లే ఎర్నాకులం, పాట్నా సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్(నం.22669) రైలుకు బెల్లంపల్లి స్టేషన్‌లో అప్ మార్గంలో హాల్టింగ్ కల్పించారు. డౌన్ మార్గంలో ఈ సౌకర్యం ఈపాటికే కొనసాగుతోంది.
- హజ్రత్ నిజాముద్దీన్ నుంచి తిరుపతి వెళ్లే ఏపీ సంపర్క్ క్రాంతి సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (నం.12708) రైలుకు మంచిర్యాల రైల్వేస్టేషన్‌లో డౌన్ మార్గంలో హాల్టింగ్‌కు అనుమతి ఇచ్చారు. అప్ మార్గంలో ఆ సౌకర్యం కొనసాగుతోంది.
- పాటలీపుత్ర నుంచి బెంగళూరు వెళ్లే పాటలీ పుత్ర సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (నం.22352) రైలుకు సిర్పూర్ కాగజ్‌నగర్ రైల్వేస్టేషన్‌లో నిలుదలకు ఉత్తర్వులు వెలువడ్డాయి.
- భద్రాచలంరోడ్ నుంచి సిర్పూర్‌కు వెళ్లే సింగరేణి ఎక్స్‌ప్రెస్ (నం.17033) రైలుకు ఆసిఫాబాద్ రోడ్ రైల్వేస్టేషన్‌లో హాల్టింగ్ పునరుద్ధరించారు.

విద్యుత్ స్తంభం ఏర్పాటు చేసిన అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

భీమారం: ‘అధికారుల వైఖ రిపై చిన్నారుల నిరసన’ శీర్షికన గురువారం ‘సాక్షి’లో ప్రచురితమైన కథనానికి విద్యుత్‌శాఖ ఏఈ కుమార్ స్పందించారు. ట్రాన్స్‌ఫార్మ ర్ ఉన్న ఎర్త్‌వైర్‌కు విద్యుత్ ప్రసరణ కావడంతో చిన్నారులు నిరసన తెలిపారు. ఈ మేరకు ఏఈ సిబ్బందిని పంపించి స్తంభం నుంచి విద్యుత్ కనెక్షన్ తొలగించారు. అనంతరం క్రేన్ సాయంతో కొత్తస్తంభం ఏర్పాటు చేశారు. ట్రాన్స్‌ఫార్మర్ బిగించి షాక్ రాకుండా ఎర్త్ ఏర్పాటు చేశారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేసిన ‘సాక్షి’కి స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.



కొత్త స్తంభానికి ట్రాన్స్‌ఫార్మర్ బిగిస్తున్న సిబ్బంది

కేకే5 గనిపై కేబుల్ చోరీ

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని కేకే–5 గనిపై గల ఎలక్ట్రికల్ మెటీరియల్ స్టోర్ నుంచి బుధవారం రెండోషిఫ్టులో విలువైన కేబుల్ చోరీకి గురైనట్లు (ఎస్‌అండ్‌పీసీ) జూనియర్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అధికారి తెలిపిన వివరాల ప్రకారం బుధవారం రాత్రి సుమారు 9.15 గంటలకు కొంత మంది దొంగలు ఒక్కసారిగా స్టోర్‌లోకి చొరబడ్డారు. విధి నిర్వహణలో ఉన్న గార్డుపై రాళ్లు రువ్వుతూ కర్రలతో బెదిరించారు. 70 మీటర్ల ప్లగ్‌తో ఉన్న ట్రెయిలింగ్ కేబుల్‌ను తీసుకెళ్లారు. కేబుల్ విలువ రూ.లక్షల్లో ఉంటుందని ఆయన పేర్కొన్నారు. చోరీకి పాల్పడిన వ్యక్తులు బయటి నుంచి వచ్చారా? లేక స్థానికులేనా? అనే విషయం తేల్చాల్సి ఉంది. ఏదిఏమైనా సింగరేణి సెక్యూరిటీ సిబ్బందితో పాటు పోలీస్ సిబ్బంది గనులపై పెట్రోలింగ్ ముమ్మరం చేయాల్సిన అవసరం ఉంది.

ఆటో బోల్తాపడి ఒకరికి గాయాలు

తిర్యాణి: ఆటో బోల్తా పడి ఒకరికి గాయాలైన సంఘటన మండలంలోని ఉల్లిపిట్ట శివారులో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఆసిఫాబాద్ మండలంలోని రింగన్‌గూడకు చెందిన సోయం మల్కు (30) గురువారం తన ఆటోలో చిర్రకుంట వైపు నుంచి తిర్యాణి మండలంలోని దంతన్‌పెల్లి శివారులో జరుగుతున్న జాతరకు వెళ్తుండగా ఉల్లిపిట్ట మూలుమలుపు వద్ద అదుపుతప్పి ఆటో బోల్తా పడింది. తీవ్రగాయాలు కావడంతో గమనించిన స్థానికులు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆటోలో రింగన్‌గూడకు చెందిన నలుగురు ప్రయాణికులు ఉండగా వారికి ఎలాంటి గాయాలు కాలేదు.

ఓపెన్ డిగ్రీలో ప్రవేశ గడువు పెంపు

మంచిర్యాలఅర్బన్: మంచిర్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఆర్ అంబేద్కర్ అధ్యయన కేంద్రంలో డిగ్రీ ప్రథమ, ద్వితీయ, తృతీయ సంవత్సరంలో ప్రవేశానికి ఈ నెల 31 వరకు గడువు పొడగించినట్లు స్టడీ సెంటర్ కోఆర్డినేటర్ రామకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్, ఐటీఐ, డిప్లొమా కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులు అడ్మిషన్లు పొందవచ్చన్నారు.

మనస్తాపంతో యువకుడు ఆత్మహత్య

తాంసి: మనస్తాపంతో పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో పొన్నారిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన ఎస్.కె.దాద్ (30) ఆటో డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. నాలుగేళ్లుగా కిడ్నీ వ్యాధితో పాటు కడుపునొప్పితో బాధపడుతున్నాడు. పలు ఆస్పత్రుల్లో చికిత్స చేయించినా వ్యాధి నయంకాలేదు. దీంతో మనస్తాపానికి గురయ్యాడు. బుధవారం ఇంటి వద్ద పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం రిమ్స్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. ఎస్సై శివరాం మృతదేహానికి పంచనామా నిర్వహించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.